లక్ష్మీనరసింహుడికి కల్యాణోత్సవ సేవ

తిరు నక్షత్రోత్సవంలో భాగంగా దివ్య ప్రబంధ పారాయణాలను పఠిస్తున్న పండితులు

యాదగిరిగుట్ట, డిసెంబర్12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్ల దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై ఊరేగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. శ్రీస్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలను ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్యతిరు కల్యాణతంతును జరిపారు. ప్రధానాలయ సాయంత్రం వేళలో శ్రీస్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారి తిరువారాధన చేపట్టి, స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన, శయనోత్సవ సేవను శాస్త్రోక్తంగా జరిపారు.

వైభవంగా ఆళ్వారుల తిరు నక్షత్రోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో తిరుమంగైయాళ్వార్, తిరుప్పాణియాళ్వార్ తిరు నక్షత్రోత్సవాలను అర్చకులు ప్రారంభించారు. రెండు రోజుల్లో భాగంగా గురువారం ప్రధానాలయంలో ఆళ్వారులను దివ్యమనోహరంగా అలంకరించి తొళక్కం నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకులు, అధ్యాపక బృందం దివ్య ప్రబంధ ప్రాశురాలను పఠించి స్వామివారిని సేవించారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలి

- అఖిలపక్ష నాయకులతో ఎంపీడీఓ

ఆలేరు రూరల్ : అఖిలపక్ష నాయకుల సమావేశంలో ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్

ఆలేరురూరల్, డిసెంబర్12 : పోలింగ్ కేంద్రాల అభ్యంతరాల ఏర్పాటుపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని 16 గ్రామాల్లో 140పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే తెలుపాలని కోరారు. అభిప్రాయాలను స్వీకరించి ఈ నెల 17న పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తామన్నారు. అఖిలపక్ష నాయకులు గంగుల శ్రీనివాస్, దూపటి వెంకటేశ్ తదితరులున్నారు.

17న పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన : ఎంపీడీఓ

ఆత్మకూరు(ఎం) : పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు తెలిపేందుకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాములునాయక్ అఖిలపక్షపార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని 23 గ్రామాలలో 192పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభిప్రాయాలను స్వీకరించి ఈ నెల 17న పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తామన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ లోకేశ్వర్ రెడ్డి, అఖిలపక్ష నాయకులు యాస లక్ష్మారెడ్డి, నగేశ్, ముత్యాలు, సిద్దులు, కాశీనాథ్, మల్లేశం, వెంకన్న, అనంతరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు 170 పోలింగ్ కేంద్రాలు

మోటకొండూర్, డిసెంబర్ 12 : గ్రామ పంచాయతి ఎన్నికలకు మండలంలో 170 పోలింగ్ కేంద్రాలను గుర్తించగా అందులో 6 పోలింగ్ కేంద్రాలను తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఇందిర తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అఖిలపక్ష నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రూపొందించిన ముసాయిదా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. ఎంపీఓ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ యశోద, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

పలు కుటుంబాలకు ఆర్థికసాయం


ఆత్మకూరు(ఎం) : ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్12 : మండల కేంద్రానికి చెందిన మురారిశెట్టి ప్రభాకర్ గుప్తా అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు గురువారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా మాజీ సర్పంచ్ నగేశ్ మృతుని కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాస కవిత, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కోరె భిక్షపతి, యాస ఇంద్రారెడ్డి, మండల సెక్రటరీ జనరల్ యాస రంగారెడ్డి, ప్రదీదీ, మాజీ సర్పంచ్ యాస లక్ష్మారెడ్డి, ఆర్యవైశ్య సంఘం గ్రామ అధ్యక్షుడు మురారిశెట్టి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చందుపట్లలో..

భువనగిరి కలెక్టరేట్ : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన సుబ్బూరు యాదమ్మ(70) కుటుంబానికి పీఏసీఎస్ చందుపట్ల బ్యాంకు సంఘ సభ్యుల డివిడెండ్ నిధి నుంచి రూ, 30వేల ఆర్థిక సాయాన్ని గురువారం మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చందుపట్ల బ్యాంకు సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా శ్రీమద్భగవద్గీత జయంతి జ్ఞాన యజ్ఞం

శ్రీ మద్భగవద్గీత జయంతి జ్ఞాన యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్, డిసెంబర్ 12 : చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం శ్రీ కృష్ణా గీతా మందిరంలో గురువారం 49వ వార్షిక శ్రీ మద్భగవద్గీత జయంతి జ్ఞాన యజ్ఞం ఘనంగా నిర్వహించారు. గీతా జయంతిని పురస్కరించుకొని శ్రీ కృష్ణా గీతామందిర కమిటీ ఆధ్వర్యంలో పద్మబ్రాహ్మణ పురోహితులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో నగర సంకీర్తన, ధ్వజారోహణం, శ్రీ భగవద్గీతా జ్ఞాన యజ్ఞం, మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, భజన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గడ్డం యాదగిరి, ఉపాధ్యక్షుడు జెల్ల శ్రీశైలం, ప్రధానకార్యదర్శి పొట్టబత్తిని పురుషోత్తం, సభ్యులు అల్మాసిపేట రామకృష్ణ, సుదర్శన్, బాలనర్సింహా, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయి : మున్సిపల్ చైర్మన్

క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

చౌటుప్పల్, డిసెంబర్ 12 : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీర దారుఢ్యానికి దోహదపడుతాయని మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ముస్కు మధుసూధన్ రెడ్డి వ్యాయామ కళాశాలలో గురువారం నిర్వహించిన సీఎం కపీ మండలస్థాయి క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరికృష్ణ, ఎంఈఓ గురువా రావు, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా రెడ్డి, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు ఆలె నాగరాజు, బండమీద మల్లేశ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త నోరు అదుపులో పెట్టుకోవాలి

- డబ్బులు వసూలు చేసుకొని పార్టీ మారిన మూర్ఖుడు
- గొంగిడి దంపతులను విమర్శిస్తే ఖబడ్దార్
- బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ

మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, డిసెంబర్12 : యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ భర్త హేమేందర్ గౌడ్ ఒక ద్రోహి అని, డబ్బులు వసూలు చేసుకొని పార్టీ మారిన మూర్ఖుడని బీఆర్ఎస్ పార్టీ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ అన్నారు. యాదగిరి గుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎక్కడో హేచరీస్ కంపెనీలో కూలీ చేసుకునే వారికి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ ఇచ్చి డబ్బులు ఖర్చు పెట్టి మరీ గెలిపించి చైర్ పర్సన్ పదవిని కట్టబెట్టిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతులపై ఆయన చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటన్నారు. అన్నం పెట్టినవారికే సున్నం పెట్టే స్వభావం కలిగిన మున్సిపల్ చైర్ పర్సన్ భర్త నోరు అదుపుపెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. చైర్ పర్సన్‌గా నియమించినందుకు గొంగిడి దంపతుల కాళ్లు మొక్కిన సంగతి మర్చిపోవద్దని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ పదవి ఎన్నికల్లో కౌన్సిలర్ల బలం లేకున్నా ఎక్స్ ఆఫిషియో సభ్యుల ఓట్లను వినియోగించుకుని తన భార్యకు చైర్ పర్సన్ పదవికి కట్టబెడితే సిగ్గులేకుండా వారి పైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తే పుట్టగతులుండవని హెచ్చరించారు. మున్సిపల్ నిధుల కింద కోతులను పట్టించేందుకు రూ. 10 లక్షలు, పందులను పట్టేందుకు రూ. 10 లక్షలు దండుకుని జేబులు నింపుకొన్న సంగతి ప్రజలు గమనిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ భర్త చేసిన అక్రమాలపై త్వరలో కార్యాచరణకు సిద్ధమైన్నట్లు చెప్పారు. కాళేశ్వరం, ఎస్ఎస్పీ, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులంటే ఏంటో తెలియని ఆయన సాగునీటి మాట్లాడుతుంటే పిల్లలు సైతం నవ్వుకుంటున్నారని అన్నారు. ఇలాంటి మూర్ఖుడిని తిప్పుకొంటున్న కాంగ్రెస్ నాయకులు ఆలోచించాలని తెలిపారు. ఏడాది కాలంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి కోరితే కాంగ్రెస్ మాజీ ఎంపీపీ, మండలాధ్యక్షుడు ఇతర నాయకులు మాట్లాడిన తీరును వారు ఎండగట్టారు. దమ్ముంటే చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీ గొంతునొక్కే ప్రయత్నం సరైంది కాదన్నారు. బడుగు బలహీన వర్గాల నేత అని చెప్పుకొంటున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆ బలహీన వర్గాల నాయకులపైనే కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం జలాలు ఒక బూట కమని చెప్పి, అవే కాళేశ్వరం జలాలను చెరువుల్లోకి మళ్లిస్తున్నారని చెప్పారు. చొల్లేరు నుంచి జమ్మాపురం గ్రామానికి గత ప్రభుత్వ హయాంలోనే డీఎంఎఫ్ కింద రూ. 1.50 కోట్లు మంజూరైతే తాము మంజూరు చేయించామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఒక్క రూపాయి కూడా కొత్త నిధులను తీసుకువచ్చిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మేడబోయిన కాటం రాజు, కౌన్సిలర్ బూడిద సురేందర్, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు మిట్ట వెంకటయ్య, శిఖ శ్రీనివాస్‌గౌడ్, గుణగంటి బాబురావు గౌడ్, పాండవుల భాస్కర్, కాటేకార్ పవన్, దావూద్, రమేశ్, వీరేశం, బాలయ్య, నర్సింహ, క్రాంతి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

- కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్ : జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 12 : ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని, కనీసం 75 శాతం మంది పాస్ కావాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో గురువారం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. టెలీమానస్ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఉపయోగపడుతుందన్నారు. అన్ని కోర్సుల విద్యార్థులకు టెస్ట్‌లు నిర్వహించాలని, వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల ప్రతిభను పర్యవేక్షించాలని తెలిపారు. హాస్టళ్లలో చదివే పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని చెప్పారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా కళాశాల ప్రిన్సిపాళ్లు ఏం చర్యలు తీసుకోవాలో ఈ సందర్భంగా ఆయన పలు అంశాలు చెప్పాలి.

నూతన డైట్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలి

జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలల్లో ఈ నెల 14న నూతన డైట్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. గురుకుల హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై వివిధ శాఖల అధికారులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ఈ నెల 14న జిల్లాలోని 85 వసతి గృహాల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని, ప్రజా ప్రతినిధులను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలువాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి రమణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.సంతోష్‌కుమార్, మండల ప్రత్యేక అధికారులు, తాసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సజావుగా నిర్వహించాలి

యాదగిరిగుట్ట : ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మాసాయిపేట గ్రామంలో సర్వే తీరును గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో ఏవైనా సందేహాలుంటే మున్సిపాలిటీ పరిధిలో వార్డు అధికారిని, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 12 : సమగ్ర శిక్ష అభియాన్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు, జాక్టో చైర్మన్ సదానందంగౌడ్, జిల్లా అధ్యక్షులు కల్లూరి రమేశ్ అన్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు గత కొన్ని రోజులుగా కలెక్టర్ కార్యాలయం వద్ద చేస్తున్న దీక్షలకు గురువారం వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వారి వెన్నంటే ఉంటామని తెలిపారు. ఉద్యోగులు చేస్తున్న దీక్షలకు డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుంకోజు భాస్కర్ రూ. 5వేల ఆర్థిక సహకారాన్ని అందించి దీక్షలో కూర్చుని మద్దతు తెలిపారు. దీక్షల్లో భాగంగా ఉద్యోగులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంగ పాండరి, కస్తూరిబా ఎస్పోలు, సీఆర్‌టీలు, పీటీఐలు, సీఆర్‌పీలు, ఎమ్ఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఆర్పీలు, మెసెంజర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీలకు వేతనాలు వెంటనే పెంచాలి

రాజాపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు

రాజాపేట, డిసెంబర్ 12 : ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు ప్రదర్శన నిర్వహించి చలో హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో అంగన్ వాడీలకు పీఎఫ్, ఈఎస్ఐతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచుతూ కొత్త జీవోను అమలు చేయాలని కోరారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించి ఇతర సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

ప్రమాదానికి కారణమైన బైక్ రైడర్‌పై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్12 : చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద 65వ జాతీయ రహదారిపై గత సోమవారం బైక్‌ను నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చట్టరీతా చర్యలు తీసుకోవాలని గురువారం చౌటుప్పల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ లాలగూడకు చెందిన సయ్యద్ రహీం ఆందోళ్ మైసమ్మ దేవాలయం రోడ్డు పక్కకు నిలబడి ఉండగా వేగంగా హైదరాబాద్ వైపునకు వెళ్తున్న బైక్ రహీంను బలంగా తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. రహీం సోదరుడు సయ్యద్ అలీం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చౌటుప్పల్ సబ్ ఇన్‌స్పెక్టర్ సి.యాదవరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్య విద్యలో విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

మాట్లాడుతున్న వికాస్ భాటియా

బీబీనగర్, డిసెంబర్ 12 : వైద్య విద్యలో విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరమని, అత్యున్నత నైతిక ప్రమాణాలు పాటిస్తూ విద్యాపరంగా రాణించాలని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. ఎంబీబీఎస్ 2024 బ్యాచ్ విద్యార్థులకు శనివారం వైట్ కోట్ వేడుకను గురువారం కళాశాలలో నిర్వహించారు. విద్యార్థులకు వైట్ కోటును అందించారు. కార్యక్రమంలో డీన్ అకాడమిక్స్ ప్రొఫెసర్ రాహుల్ నారంగ్, ప్రొఫెసర్ నితిన్ అశోక్ జాన్, డాక్టర్లు సుబ్బయ్య, షణ్ముఖం, వసంత కామత్, అసోసియేట్ ప్రొఫెస్సర్ ఆర్.శ్యామల, వైద్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో హర్యానా గవర్నర్ పర్యటన

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 12 : హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించి, మధ్యాహ్నం 1 గంటకు కాచారం, ధర్మారెడ్డిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టడీ కిట్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు స్వర్ణగిరి వెంకటేశ్వర దేవస్థానం, మానెపల్లి హిల్స్‌లో పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

యువతి అదృశ్యం

గంగాదేవి కావ్య

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్12 : చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యం అయినట్లు గురువారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగాదేవి కావ్య(18) ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో పూర్తి చేసింది. ఈ నెల 8న ఉద్యోగం వెతుక్కోవడానికి హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు చెప్పి బయల్దేరింది. ఆరోజు నుంచి కనబడటం లేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని, ఐదు రోజులుగా వెతికినప్పటికీ ఫలితం లేదని కావ్య తల్లి గంగాదేవి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిటన్లు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. లక్ష్మయ్య తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్12 : స్కూల్ బస్సు, బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలైన ఘటన గురువారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డాకుతండా గ్రామానికి చెందిన కరంటోతు రాజేశ్, వెంకటేష్, దిలీప్ ముగ్గురు బైక్‌పై పనుల నిమిత్తం గట్టుప్పల్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా గట్టుప్పల్‌కు చెందిన కల్గురాం గుర్కా విద్యాయిని స్కూల్ బస్సు డాకుతండాలో పాఠశాల విద్యార్థులను దింపి తిరిగి వస్తుండగా లచ్చమ్మగూడెం సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

మోత్కూరులో ఆశ కార్యకర్త రహిమ్‌బీని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డికి చంద్రబాబు చెల్లించుకున్న మూల్యం తప్పదు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, డిసెంబర్12: ఆశ కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేసి వారిపై పోలీసులతో దౌర్జన్యంగా దాడి చేయించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు తగిన మూల్యం చెల్లించక తప్పదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కాశవారిగూడేనికి చెందిన ఆశ కార్యకర్త రహిమ్‌బీని గురువారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమైక్య పాలనలోనూ అప్పటి సీఎం చంద్రబాబునాయుడు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు శాంతియుతంగా హైదరాబాదులో ఆందోళన చేస్తుంటే పోలీసుల, గుర్రాలతో దాడులు చేయించారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఆశ కార్యకర్తలు ఎన్నికల హామీలను అమలు చేయాలని వైద్యారోగ్య శాఖ కమిషనర్‌కు వినతి ఇవ్వడం కోసం వెళ్తే పోలీసులతో అక్రమ అరెస్టులు చేసి దాడి చేశారని అన్నారు. దాడుల్లో మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన రహిమ్‌బీ గాయాలపాలై దవాఖాన పాలుకావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా రహిమ్‌బీ వైద్యం కోసం రూ. 6వేలను అందచేశారు. బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, జంగ శ్రీను, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, రైతు బంధు మండల సమితి మాజీ అధ్యక్షుడు కొండ సోంమల్లు, మాజీ సర్పంచు బయ్యని పిచ్చయ్య, నాయకులు మర్రి అనిల్‌కుమార్, దబ్బెటి శైలజ, బొడిగె శ్రీను, అన్నందాస్ విద్యాసాగర్, ఇంద్రశేఖర్, శ్రీను, రమేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే బొందుగుల చెరువును నింపాం

- మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి